ప్రజాశక్తి
శుక్రవారం 11 నవంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు



యడ్లపాడు మండలం వంకాయలపాడులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

సమస్యలతో స్వాగతం

- నేడు గుంటూరు, వంకాయలపాడులో నేడు సిఎం పర్యటన
- ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రజా ప్రతినిధులకు అవకాశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గుంటూరు ప్రజలు పలు సమస్యలతో స్వాగతం పలకనున్నారు. సిఎం జగన్ గుంటూరు, పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని వంకాయలపాడులో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గుంటూరులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను ప్రజా ప్రతినిధులు సిఎం వద్ద ప్రస్తావించే అవకాశం ఉంది. అయితే ప్రజా ప్రతినిధులు చేసే విజ్ఞాపనలకు ఆయన సానుకూలంగా స్పందించి ఏ మేరకు హామీలు ఇస్తారన్నదీ ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది.

గుంటూరులో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూగర్భ డ్రెయినేజి పథకం (యుజిడి) అసంపూర్తిగా ఉంది. రూ.903 కోట్లతో చేపట్టిన ఈ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో 52 శాతం వరకు చేసినా మూడున్నరేళ్లుగా నిలిచిపోయాయి. యుజిడి కోసం చేసిన తవ్వకాల వల్ల గుంటూరులో

2లో

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

సిఎం పర్యటన వివరాలను అధికారులు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి, 9.25 గంటలకు యడ్లపాడు మండలం వంకాయలపాడు స్పైసెస్ (సుగంధ ద్రవ్యాల) పార్క్‌కు చేరుకుంటారు. కొద్దిసేపు ప్రజా ప్రతినిధులను కలుసు కుంటారు. ఉదయం 9.40 గంటల నుంచి 10.35 గంటల వరకు స్పైసెస్ పార్క్‌లో ఐటిసి సంస్థ ఏర్పాటుచేసిన గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్ ప్రారంభో త్సవంలో పాల్గొంటారు. 10.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.10 గంటలకు గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.25 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12.30 గంటలకు గుంటూరు మెడికల్ కాలేజ్ చేరుకుని ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.40 గంట లకు బయలుదేరి 1.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.



గుంటూరు ఛానల్ విస్తరణ కోసం ఐక్య పోరాటం

- భూసేకరణకు సత్వరమే నిధులు కేటాయించాలి
- రైతు సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- 1939 నుండి ఉన్న సమస్యపై ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదు
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు, పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలంటే రైతులు, ఈ ప్రాంత ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఛానల్ విస్తరణ చేపట్టాలని, అందుకు భూసేకరణకు నిధులను వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన పెదనందిపాడు పాతబస్టాండ్ సెంటర్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు నల్లమడ రైతు సంఘం నాయకులు కుర్ర హరిబాబు అధ్యక్షత వహించారు, ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణపై తాను శాసన మండలిలో పలుమార్లు ప్రస్తావించానని, పలు వేదికలపై మాట్లాడి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చానని చెప్పారు. ఛానల్ పొడిగింపు కోసం ఏన్నో ఏళ్లుగా పోరాటం నడుస్తోందని, నల్లమడ రైతు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లా వెంకయ్య, ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు నల్లమడ అభివృద్ధి కోసం, విస్తరణ కోసం పోరాడారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగించిన చరిత్ర పెదనందిపాడు ప్రాంతానికి ఉందని, ఆ స్ఫూర్తితో ఇప్పుడూ అవిశ్రాంతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లోనే అభివృద్ధి సాధ్యమైందని, గుంటూరు ఛానల్‌ను విస్తరిస్తే 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వస్తున్న నేపథ్యంలో గుంటూరు ఛానల్ విస్తరణపై వినతిపత్రం ఇస్తామని తెలిపారు. దీంతోపాటు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించేందుకు 19, 20 తేదీల్లో గుంటూరులో ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయన్నారు. సమావేశాలకు 29 రాష్ట్రాల నుండి నాయకులు హాజరవుతారని, 19న సాయంత్రం 3 గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే సదస్సులో రైతులంతా పాల్గొనాలని కోరారు.

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ సమస్య 1939 నుంచి ఉందని, కీలకమైన ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదని విమర్శించారు. పాలకుల విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతోందని, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వల్ల రైతులు, కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వారిని అదుకునేందుకు ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయాలని, ఎంఎస్ స్వామినాథన్

2లో

మోడీ పర్యటనపై వైసిపి అత్యుత్సాహం సిగ్గుచేటు

4లో

- ప్రధాని పర్యటనను అడ్డుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల పిలుపు



ఇంటి వద్దే గంజాయి పెంపకం

మొక్కను స్వాధీనం చేసుకున్న సెబ్

2లో



విలేకర్లతో మాట్లాడుతున్న అమరావతి సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి

నన్నూ అలంకార ప్రాయమే చేశారు..

- పెత్తనమంతా ఉపసర్పంచ్‌దే
- సంతకా అవసరమైతేనే పిలుస్తున్నారు
- టీ కావాలన్నా వారి అనుమతి కావాలంట..
- ఎమ్మెల్యేకు చెప్పినా ఫలితం లేదు
- అమరావతి ఎస్టీ మహిళా సర్పంచ్ ఆవేదన

ప్రజాశక్తి - అమరావతి

సర్పంచ్ తానే అయినా పెత్తనం మొత్తం ఉపరసర్పంచ్ చేస్తున్నాడని, టీ తెప్పించుకు తాగాలన్నా వారి అనుమతి కావాలంటున్నారని మండల కేంద్రమైన అమరావతి మహిళా సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడి తాను ఎదుర్కొంటున్న వివక్ష, ఇబ్బందులను వివరించారు. ఎస్టీ సామాజిక తరగతికి చెందిన తాను

2లో

క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చి మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రెవెన్యూ ఉద్యోగులు

8లో



నేటి నుండి వర్సిటీలో రెవెన్యూ క్రీడలు



కార్మికుల భద్రతకు ప్రాధ్యానత

ప్రజాశక్తి-మాచర్ల

మున్సిపల్ కార్యాలయ పరిధిలో పారిశుధ్య విభాగంలో పనిచేసే కార్మికుల భద్రతకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, కమిషనర్ ఇవి రమణబాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 160 మంది పారిశుద్ధ్య కార్మి కులకు రేడియం ఉన్న సేఫ్ జాకెట్స్‌ను అందజేశారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు మాట్లాడుతూ తెల్లవారుజాము నుండి పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సేఫ్ జాకెట్స్ అందజేసినట్లు వివరించారు. ప్రతి కార్మికుడికి ఆరెంజ్ కలర్, గ్రీన్ కలర్ సేఫ్ జాకెట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. వీటిని ధరించి వారు ప్రధాన రహదారులలో పని చేసేటప్పుడు వాహన ప్రమాదాలకు గురికారని వివరించారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన కిట్స్ ఎప్పటికప్పుడు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో మున్సిపల్ ఉద్యోగులు రాజా, సిబ్బంది పాల్గొన్నారు.



ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించండి

ప్రజాశక్తి - కారెంపూడి

గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి శ్రీనివాసరెడ్డి.అన్నారు గురువారం ఎంపీపీ మేకల శారద శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సం బంధించి బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశ̄ెట్టగా సభ్యు లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆరోగ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద మండలంలోని పెదకోదమగుండ్ల, మిరియాల తదితర గ్రామాలలో మంచి నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ఒప్పిచర్లలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బత్తుల యలమందారెడ్డి మాట్లాడుతూ ఇటీ వల కురిసిన వర్షాలకు మిర్చి పంటకు కొండాపు తెగులు ఎర్రాటాకుగా వస్తున్నా యని వాటి నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచ నల మేరకు నివారించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీని పూర్తి స్థాయిలో పూర్తి చేశామన్నారు. పీఎంజేఏవై కింద మండలానికి 467 ఇళ్లు మంజూరైనట్లు హౌసింగ్ ఏఈ జైరావు తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి షేక్ షఫీ, సొసైటీ చైర్మన్ ఎన్. గురవారెడ్డి,ఎంఈఓ నాగయ్య, ఈవోపీఆర్డి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత న్యూరో వైద్య శిబిరం

ప్రజాశక్తి- నరసరావుపేట

సత్తెనపల్లి రోడ్డులోని తమ హాస్పిటల్ న్యూరాలజీ విభాగానికి సంబంధించి శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అంజిరెడ్డి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వైద్య శిబిరంలో మెదడు, వెన్నుముక సమస్యలు,ఫిట్స్, పక్షవాతం, నరాల బలహీనత, నడుం, మెడ, వెన్నుముక నొప్పులు, కాళు చేతులు తిమ్మిర్లు రావడం మొదలగు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎమ్.సి.హెచ్ న్యూరో సర్జరీ డాక్టర్ గుమ్మడి విద్యాసాగర్ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.ఆపరేషన్ లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని పల్నాడు జిల్లా , పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బుడిబుడి అడుగులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీ వేత్త , ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని రచించిన బాలల కథల సంపుటి 'బుడిబుడి అడుగులు' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హకీం జానిని ఆయన అభినందించారు. 39 నీతి కథలతో రచించిన పుస్తకాన్ని హైదరాబాద్ హయత్ నగర్‌కు చెందిన లక్ష్మీ శ్రీనివాస పబ్లికేషన్స్ అదినేత కెవి నాగేశ్వరరావు ప్రచురించారని, బాపట్లకు చెందిన చిత్రకళా ఉపాధ్యాయులు వెంకట్ చిత్రాలను అందించారని హకీంజాని తెలిపారు. హకీం జాని రచనల్లో బుడిబుడి అడుగులు 35వ సంపుటి. ఈ సంపుటిలో కేంద్ర సాహిత్య అకాడమి బాలసాహిత్య పురస్కార గ్రహీతలు డాక్టర్ పత్తిపాక మోహన్, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు పుస్తకానికి ముందు మాట రచించారన్నారు. పుస్తకావిష్కరణలో ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ జి.విజయగీత, గుంటూరు-2డిపో మేనేజర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.



కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్



సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు



సదస్సుకు హాజరైన రైతులు, ప్రజలు

గుంటూరు ఛానల్ విస్తరణ కోసం ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణకు నిధులు కేటాయించాలన్నారు. పాలు, పాల ఉత్పత్తులపైనా కేంద్రం జిఎస్‌టి విధించిందని, అయితే రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాలను మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. రైతులకు భారంగా మారిన ఈ సమస్యలన్నింటిపైనా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ ఎంపిపి నర్రా నర్రా బాలకృష్ణ మాట్లాడుతూ ఈ సమస్యలపై ఇప్పటికే జరిగిన అనేక పోరాటాల్లో తాను ప్రత్యక్షంగా పాల్గొన్నాని, ఇకమీదట తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం నల్లమడ రైతు సంఘం నాయకులు ఎస్.ఆచారి, బండి నాగేశ్వరరావు మాటాడారు. సదస్సులో ప్రజా సంఘాల నాయకులు కె.నాగేశ్వరరావు, డి.రమేష్‌బాబు, కె.శివనాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటశివరావు, సిహెచ్.యానాదులు, డి.శ్రీను, ఎం. రమణ, బి.చిన్న పున్నయ్య, జి.శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, పి.వెంకటప్పయ్య, సిహెచ్.సురేంద్ర, పి.సుధీర్, జి.మోహన్‌రావు, రమేష్ మాస్టారు, రైతులు పాల్గొన్నారు.

నన్నూ అలంకార ప్రాయమే చేశారు..

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచ్‌గా ఎన్నియ్యానని, అయితే పంచాయతీ వ్యవహారాలన్నీ పెత్తందారు సామాజిక తరగతికి చెందిన ఉపసర్పంచ్ నిమ్మ విజయ్‌సాగర్‌బాబు కనసన్నల్లో నడుస్తున్నాయని చెప్పారు. తన విధులు తనను చేసుకోనివ్వడం లేదని, స్వీపర్ కంటే దారుణంగా చూస్తున్నారని ఆరోపించారు. టీ తెప్పించుకుని తాగాలన్నా ఉపసర్పంచ్ అనుమతి కావాలంటూ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు అంటున్నారని తెలిపారు. విధి నిర్వహణలో కార్యదర్శి, తదితర అధికారులు తనకు ఏ మాత్రమూ సహకరించడం లేదని, వీటన్నింటిపై ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు తెలిపినా ఫలితం లేకపోయిందన్నారు.

తనను అలంకా ͑ప్రాయంగా చేశారని, చెక్కుల మీద సం తకాల కోసమే ఉపయోగించుకుంటున్నా రని అన్నారు. వీటిపై ప్రశ్నిస్తే కమీషన్ అడుగుతున్నామంటూ ఆరోపణలు చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల వివరాలూ తనకు తెలియవని తెలిపారు. ఉపరసర్పంచ్ అనుచరులైన నిమ్మ రాంబాబు, వేములపల్లి నాగార్జున చౌదరి, ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు అనేక అవమానాలకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇదే సమయంలో కార్యాలయానికి వచ్చిన పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజును విలేకర్లు వివరణ కోరగా పంచాయతీలో చేసిన పనులు, ఖర్చుల వివరాలన్నీ సర్పంచ్‌కు తెలిపాకే సంతకాలు తీసుకుంటున్నామని, ఆమె విధి నిర్వహణకు ఆటంకాలేమీ కల్పించడం లేదని అన్నారు. ఇదిలా ఉండగా దాదాపు ఇదే తరహాలో పరిస్థితిని మండలంలోని అత్తలూరు దళిత మహిళా సర్పంచ్ బంకా సరోజిని సైతం ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ప్రజా సంఘాల అండగాతో సరోజిని ఆత్మ గౌరవ పోరాటం చేస్తుండగా నిందితులపై ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది.

ఇంటి వద్దే గంజాయి పెంపకం

మొక్కను స్వాధీనం చేసుకున్న సెబ్

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో గంజాయి విక్రయాలపై వరుస దాడులు జరుగుతున్నాయి. స్థానిక నందులపేట క్లబ్ రోడ్డులో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిఐ వెంకటాచలం నేతృత్వంలో గురువారం దాడి చేశారు. పిల్లి మనోజ్‌కుమార్ అలియాస్ గోపి తన ఇంటి పక్క ఖాళీ స్థలంలో పెంచుతున్న గంజాయి మొక్కను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సిఐ వెంకటాచలం మాట్లాడుతూ గంజాయి విక్రయంపై వచ్చిన విశ్వసనీయ సమాచారంతో దాడి చేశామని, నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు. అతని తల్లి నుంచి వివరాలు సేకరించామన్నారు. గోపి గంజాయి అకులను తుంచి, ఎండబెట్టి పొడిగా చేసి విక్రయిస్తున్నట్లు అతని తల్లి తెలిపినట్లు చెప్పారు. అతని ఇంటి నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గంజాయిపై సమాచారం ఉంటే సెబ్ అధికారులకు తెలపాలని కోరారు. దాడుల్లో స్థానిక పోలీసులు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లెలో గడపగడపకు

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు నియోజకవర్గంలోని మునిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉత్సాహభరితంగా సాగింది. ఎమ్మెల్యే రోశయ్య ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వంఅందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుతెన్నులపై లబ్ధిదారులను వాకబు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్న ప్రభుత్వ పనితీరుపై మునిపల్లెలోని లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

సమస్యలతో స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ పూర్తి స్థాయిలో జరగడం లేదు. నగరంలో రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గుంటూరులో సిఎం పర్యటించే మార్గంలో మున్సిపల్ అధికారులు రెండ్రోజులుగా మరమ్మతులు చేపట్టారు. నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్డు, పలకలూరు రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ గోతులు, గుంతలమయంగా మారాయి.

మరోవైపు గుంటూరులో పదేళ్లుగా అభివృద్ధి నిలిచిపోయింది. కొత్త కౌన్సిల్ కొలువుదీరి ఏడాదిన్నర దాటినా ఇంతవరకు చెప్పుకోగద్ద అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. గుంటూరులో రూ.460 కోట్లతో చేపట్టిన రక్షిత నీటి పథకం అసంపూర్తిగానే ఉంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ, ప్రత్యేకంగా పిల్లల వైద్యశాల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. గుంటూరు నగర పాలక సంస్థకు నిధుల కొరతతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

శంకర్ విలాస్ నుంచి మార్కెట్ వైపునకు వెళే మార్గంలో ఉన్న ఆర్‌వోబి ఇరుకుగా మారింది. 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి స్థానంలో ఆరులైన్ల బ్రిడ్జి నిర్మించాలని ప్రజాప్రతినిధులు కొన్నేళ్లుగా కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. శ్యామలానగర్, నెహ్రూనగర్ వద్ద ఆర్‌యుబిలను నిర్మించాలని, రెడ్డిపాలెం వద్ద ఆర్వోబీని నిర్మించాలని సిఎంకు పలుమార్లు గుంటూరులోని ప్రజాప్రతినిధులు కోరుతున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదు. మైనార్టీలకు సంబంధించి ముస్లిమ్ కౌన్సెలింగ్ సెంటర్, లైబ్రరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

నగరంలో ఆహ్లాదం ఎండమావిగా మారింది. మానససరోవరం, గాంధీ పార్కు అభివృద్ధికి నోచడం లేదు. ఈ మేరకు ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, ముస్తాఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు సిఎంకు వినతిపత్రాలు ఇవ్వనున్నారని తెలిసింది. కొంతకాలంగా సిఎంను క్యాంపు కార్యాలయంలో కలిసేందుకు పెద్దగా అవకాశాలు రావడం లేదని ప్రజా ప్రతినిధులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో హెలిప్యాడ్ వద్ద కలిసేందుకు వీరికి దాదాపు 30 నిమిషాలు కేటాయించారు.

మందగమనంగా స్పైసెస్ పార్కు

యడ్లపాడు మండలం వంకాయలపాడు స్పైసెస్ పార్కు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. కొత్త యూనిట్ల ఏర్పాటు మందగమనంగా సాగుతోంది. 2015లో ప్రారంభించిన ఈ పార్కులో ఎక్కువగా మిర్చి, పసుపు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు భూమి, నీరు అందించారు. అయితే జాతీయ రహదారికి అనుసంధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సిఎం పర్యటనతో ఈ రహదారులు కొంత మరమ్మతులు చేపట్టారు. రూ.250 కోట్లతో ఐటిసి నిర్మించిన మిర్చి ప్రాసెసింగ్ యూనిట్‌ను సిఎం జగన్ శుక్రవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ పార్కు వైపు అధికారులు దృష్టిసారించారు.

హార్మోనిస్ట్ శివన్నారాయణకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియే టర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం ఎన్ టిఆర్ నటించిన చిత్రాన్ని ఉచితంగా ప్రద ర్శించారు. అలాగే కళాకారులను సత్కాల పండగలో భాగంగా ప్రముఖ హార్మోనిస్ట్ నందికట్టి శివన్నారాయణను ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు.

హైకోర్టు స్టే శుభపరిణామం

ప్రజాశక్తి-మాచవరం

మాచవరం మండలంలోని తురకపాలెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 18 మందిపై పెట్టిన కేసుపై గురువారం హైకోర్టు స్టే విధించడం శుభపరిణా మమని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాటలు విని మాచవరం పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు.

చాప కింద నీరులా గంజాయి

- తెనాలిలో వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- పశ్నించిన వారిపై దాడులకూ తెగబడుతున్న వైనం



మాట్లాడుతున్న డిఎస్‌పి స్రవంతిరాయ్ (ఫైల్)



మృతుడు బత్తుల అనిల్ (ఫైల్)

ప్రజాశక్తి-తెనాలి

గంజాయి మహమ్మారి పట్టణాన్ని పట్టి పీడిస్తోంది. చాప కింద నీరులా పట్టణం నుంచి గ్రామాలకు గంజాయి ముఠా విస్తరిస్తోంది. విద్యార్థులే లక్ష్యంగా రోజు రోజుకూ దీని వ్యాపారం పెరిగిపోతుంది. చివరికి పచ్చటి పల్లెటూళ్ళలో కూడా గంజాయి రవాణ సాగుతోంది. కొందరు సుళువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను లక్ష్యంగా ఎంచుకోని ఎదురించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. తాజాగా పట్టణంలో చోటు చేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళ్తే..

స్థానిక సుల్తానాబాద్ వడ్డెర కాలనీలో గత నెల 29న యువకుడు బత్తుల అనిల్(26) దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు కేవలం గంజాయి ముఠా ఆగడాలే కారణమని మృతుని కుటుంబ సబ్యులు, స్థానిక మహిళలు చెప్పారు. పైగా పోలీసులపై కూడా విమర్శలు గుప్పించారు. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన ఉప్పు రంగారావు, అరికాటి వెంకటకృష్ణ, తమ్మిశెట్టి హరీష్, గేరా ప్రేమ్‌కుమార్, ,శ్రవనం రాజేష్, బండారు యశ్వంత్‌ను నిందితులుగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. అయితే ఓ కళాశాల్లో ఇంటర్ చదువుతున్న మృతుడు అనిల్ మేనల్లుడిని గంజాయి సేవించాల్సిందిగా నిందితులు బలవంతం చేయటంతో బాలుడు విషయాన్ని తన మామ అనిల్‌కు చెప్పాడు. దీనిపై వారిని అనిల్ ప్రశ్నించగా వారు దాడి చేశారని అతని కటుంబ సభ్యులు చెబుతున్నారు. వెంటనే త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశామని, దాని కారణంగా బాలుడిపై కూడా దాడికి పాల్పడ్డారన్నారు. కుటుంబ సభ్యులు మరలా పోలీసులను ఆశ్రయించినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై కక్ష పెంచుకున్న నిందితులు చివరికి అనిల్‌ను హతమార్చారని కుటుంబ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. అయితే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు మాత్రం కేవలం పాతకక్షలే హత్యకు కారణంగా చెప్పటం విమర్శలకు తావిచ్చింది. అంతకంటే ముఖ్యమైన విషయం నిందితులంతా 22 ఏళ్ళ లోపు వారే. ఇదిలా ఉంటే గంజాయి విక్రయిస్తున్నారంటూ ఈనెల 4న టూటౌన్ పోలీసులు పట్టణానికి చెందిన సిహెచ్ అఖిల్, చేబ్రోలు జాన్ విక్టర్, సింహాద్రి పూర్ణచంద్, షేక్ భాషాను అరెస్ట్ చేశారు. ఒకొక్కరి నుంచి 250 గ్రాముల చొప్పున గంజాయినీ స్వాదీనం చేసుకున్నారు. నిందితులంతా 24 ఏళ్ళలోపు వారు. చదువులు గాలికొదిలేసి విద్యార్థులు, వ్యవసనపరులే లక్ష్యంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనికి ఆధ్యుడైన పట్టణానికి చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్ పారిపోగా అతని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తాజాగా ఈనెల 8న పట్టణంలోని పినపాడుకు చెందిన ఆదిన నాగరాజు, ఆరేపల్లి ఆదివాసు ఇరువురూ కలిసి బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన మహిళ అన్నారెడ్డి మణి వద్ద గంజాయి కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నట్లు గుర్తించిన త్రీటౌన్ పోలీసులు ముగ్గురినీ అరెస్ట్ చేశారు. ఈ వరుస ఘటనలను పరిశీలిస్తే గంజాయి ముఠా తెనాలి పట్టణంలో ఎలా విస్తరిస్తోందే అర్థం చేసుకోవచ్చు. వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రతేక నిఘా పెట్టి, గంజాయి ముఠా ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంది

-కె.స్రవంతిరాయ్, డిఎస్‌పి తెనాలి

సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేకించి గంజాయి విక్రయాలపై నిఘా ఉంది. ఖచ్చితమైన సమాచారం రావటం ఒకింత ఆలస్యమైనా పక్కా సమాచారంతో దాడి చేస్తాం. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టణంలోని టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా జరిగిన ఆరెస్ట్‌లు పక్కా సమాచారంతో జరిగినవే. ఉపేక్షించేది లేదు.. సుల్తానాబాద్‌లో గతనెల 29న జరిగిన యువకుడి హత్య గంజాయి ముఠా పనిగా మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దానిలో వాస్తవం లేదు. పూర్తిగా విచారించాం. అది కేవలం పాత కక్షల నేపథ్యమే.



డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- మేడికొండూరు.

మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్‌లో గల డివైడర్ వద్ద గురువారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. నరసరావుపేట వైపు నుండి గుంటూరు వైపు వెళు తున్న లోడు లారీ డివైడర్ పైకి ఎక్కింది. అదే సమయంలో ప్రయాణికులతో వెళుతున్న ఆటోకి పెను ప్రమాదం తృటిలో తప్పింది. రోడ్డు విస్తరణలో భాగంగా నరసరావుపేట రోడ్‌లో ఉష పౌల్ట్రీ ఎదురుగా రోడ్డుకు మధ్యలో డివైడరును ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో డివైడరు ఉన్నట్లు ముందస్తు గుర్తింపు సూచికలు అధికారులు ఏర్పాటు చేయలేదు. రేడియం స్టిక్కర్లు కూడా లేకపోవడంతో ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు రేడియం స్టిక్కర్లను, డివైడర్ సూచిక గుర్తులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు .

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 14 నుంచి 20 వరకూ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాల యాధికారిణి కావూరి రమాదేవి తెలిపారు. వారోత్సవాల ప్రారంభోత్సవ సభ 14న సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా గ్రంథాలయశాఖ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ పాల్గొంటారన్నారు.

సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయంలో...

రూరల్ పరిధిలోని సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయంలో 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు లైబ్రేరియన్ జె.వెంకటేశ్వర్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలు, అలాగే కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనే విధంగా

ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితులు అరెస్టు

- రూ.5లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు స్వాదీనం
- నిందితుల్లో ముగ్గురు మైనర్లు



వివరాలు వెల్లడిస్తున్న సిఐ చంద్రశేఖర్, స్వాదీనం చేసుకున్న బైక్‌లు

ప్రజాశక్తి-తెనాలి

బైక్‌ల అపహరణ కేసులో నలుగురు నిందితులను పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5లక్షల విలువైన బైక్‌లు స్వాదీనం చేసుకున్నారు. స్థానిక ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ కె.చంద్రశేఖర్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం నేలపాడుకు చెందిన బొడ్డు నిఖిల్, మరో ముగ్గురు మైనర్లు మిత్రులు. వీరంతా ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణ ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక హెూండా యాక్టివా, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సెల్‌ఫోన్, వేమూరు పోలీస్ స్టేషన్ పరిదిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం, గుంటూరు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పల్సర్ బైక్, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఓ పల్సర్ బైక్‌ను అపహరించారు. పట్టణ ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెూండా యాక్టివా అపహరణతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నిందితులను పట్టణంలోని నాజరుపేటలో అదుపు లోకి తీసుకున్నట్లు సిఐ వెల్లడించారు. నిందితుల నుంచి అపహరణకు గురైన వాహనాలు, సెల్‌ఫోన్‌లను స్వాదీనం చేసు కున్నామని, వాటి విలువ రూ.5లక్షలు ఉంటుందన్నారు. కేసును దర్యాప్తు చేయటంలో చురుకైన పాత్ర పోషించిన సిఐతో పాటు ఎస్‌ఐలు ఉమామహేశ్వర్, డేవిడ్ దాస్, ఏఎస్‌ఐ కె.రత్నరాజు, ఎస్.శివకుమార్, హెడ్ కానిస్టేబుల్స్ ఎం.సురేష్, ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటేష్, కె.రాజు, కానిస్టుబుల్స్ ఎస్.శివకోటే శ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, కె.బాబురావులను డిఎస్పీ అభినందించినట్లు సిఐ తెలిపారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	37,385
మిర్చి ఎగుమతి	:	39,560
మిర్చి నిల్వ	:	10,012

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9000- 28200
273	21500- 26000
341	17000- 28000
4884	24200- 24500
సూపర్10	25800- 25800
నాన్ ఎసి	
తేజ	9500- 25000
బడిగి	15200- 28000
దేవనూర్ డీలక్స్	15000- 27500
తాలుకాయలు	5,000- 14,000
ఎసి	
334	15000 - 28000
నెం-5	20000 - 26000
273	22500 - 24000
341	23500 - 27000
సూపర్ -10	24000 - 25000
తేజ	10500 - 25000
బడిగి	20000 - 27000
దేవనూర్ డీలక్స్	12000 - 25000
తాలుకాయలు	5,400 - 12,000

రోటరీ క్లబ్ వితరణ

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ : స్థానిక ప్రభుత్వ బిసి వసతి గృహాల్లోని విద్యార్థులకు రోటరీ క్లబ్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో దుప్పట్లు, రగ్గులు, పండ్లు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. చలి తీవ్రవత పెరగడంతో హాస్టల్లోని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని రోటరీ క్లబ్ వెంటనే స్పందించి ప్రభుత్వ బిసి హాస్టల్లో ఉన్న 16 మంది విద్యార్థులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. సందర్భంగా రోటరీ క్లబ్ పొన్నూరు అధ్యక్షులు బోడపాటి రామారావు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలలో రోటరీ విస్తృతమైన సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరావు సభ్యులు ఎన్ బాలకృష్ణ, కుదుస్ పాల్గొన్నారు.





మహాసభలో మాట్లాడుతున్న జి.రవిబాబు

పనిభారం.. చాలీచాలని జీతం..

సిఐటియు మండల మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - క్రోసూరు

పాలకుల విధానం వల్ల పనిభారం, చాలీచాలని వేతనాలతో కార్మికులు అవస్థ పడుతున్నారని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులో ఆమంచి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు మండల మహాసభ గురువారం నిర్వహించారు. సభకు యు.మురళి అధ్యక్షత వహించగా రవిబాబు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న కార్మికుల సమస్యల పరిష్కారం కావాలంటే నిర్బంధాలను ప్రతిఘటించి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు కాలరాయబడతాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు అమలవ్వాల్సిన సంక్షేమ పథకాలను వైసిపి అధికారంలోకి వచ్చాక నిలిపేశారని, ఇది తీరని ద్రోహమని అన్నారు. సత్వరమే ఆ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యు.మురళి, కార్యదర్శిగా జి.మహేష్, ఉపాధ్యక్షులుగా రమేష్, సహాయ కార్యదర్శిగా జి.శివపార్వతి, సభ్యులుగా సిహెచ్ యేసయ్య, సీత, డి.కోటేశ్వరి, బి.జయలక్ష్మి, కె.మంగమ్మ, ఎం.విజయలక్ష్మి, టి.జగన్నాథం, దినేష్ ఎన్నికయ్యారు.

నేడు రవాణా కార్మికుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎపీ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ పిడుగురాళ్లలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో గురువారం కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగం కార్మికులకు ప్రమాదభరితమైన 2019 ట్రాన్స్‌పోర్ట్ బిల్లును కేంద్రం తెచ్చిందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు విద్య, వైద్యం అందించాలని కోరారు. ఇళ్లులేని వారికి జగన్న కాలనీల్లో ఇల్లు మంజూరు చేయాలని, 60 ఏళ్ల దాటిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.6 వేల పింఛను, ప్రమాదంలో చనిపోతే కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. చదువుతో నిమిత్తం లేకుండా లైసెన్సులు మంజూరు చేయాలని, సొంతంగా ఆటో నడపాలనుకునే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని అన్నారు. ఈ అన్ని అంశాలపై చర్చించి పోరాటా కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహించే మహాసభలో రవాణా రంగం కార్మికులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పి.వెంకటేశ్వర్లు

మోడీ పర్యటనపై వైసిపి అత్యుత్సాహం సిగ్గుచేటు

ప్రధాని పర్యటనను అడ్డుకోవాలి - రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - నరసరావుపేట

విశాఖపట్నంలో ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటనను అడ్డుకోవాలని వామపక్షాల పిలుపునిచ్చాయి. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆస్తులతో కూడగట్టిన ప్రభుత్వ రంగ సంస్థలను, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తోందని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన నరేంద్ర మోడీ ఏ మొహం పెట్టుకుని రాష్ట్రంలో పర్యటిస్తారని ప్రశ్నించారు. వీటిపై కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి మాత్రం మోడీ పర్యటనపె అత్యుత్సాహం చూపటం సిగ్గుచేటన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నాయకులు చవక్రవరం సత్యనారాయణ రాజు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉన్న ఎల్ఐసిని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మికుల హక్కులనూ కాలరాస్తున్నారని, కార్మికుల పరిస్థితిని కేంద్రం నానాటికీ దిగజారుస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కార్మికులు ఏళ్ల తరబడి పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు మండిపడ్డారు. విభజన హక్కుల సాధన, ప్రత్యేక హోదా, వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు తదితర అంశాలపై ప్రధాని మోడీని, రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు వై.గోపాలరావు, కె.రామారావు, డి.శివకుమారి, ఎస్.ఆంజనేయ నాయక్, వి.వెంకట్, యు.రంగయ్య, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

వ్యవసాయ పరిరక్షణకు ఉద్యమం

వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - యడ్లపాడు

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలనే పాలకుల కుట్రలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ రక్షణ కోసం అందరూ ఉద్యమించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల 6వ మహాసభ మండల కేంద్రమైన యడ్లపాడులోని పాల సొసైటీ భవనంలో గురువారం నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికంగా సంఘం జెండాను సీనియర్ నాయకులు ఎలమంద పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభకు అధ్యక్ష వర్గంగా సాతులూరు లూథర్, దావల అన్నపూర్ణమ్మ వ్యవహరించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ పల్నాడు జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాలు సాగవ్వలేదని, దీంతో వ్యవసాయ కూలీలకు పనులు తగ్గి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మరోవైపు వ్యవసాయం నుండి రైతులను దూరం చేసి కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం రూ.600 పెంచాలని కోరారు. అనంతరం సిఐటియు, రైతు సంఘం మండల కార్యదర్శులు టి.కోటేశ్వరరావు, జె.శంకర రావు, సౌహార్ద సందేశాలిచ్చారు. కార్యదర్శి నివేదికను కె.రోశయ్య ప్రవేశపెట్టగా తొలుత అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా 21 మందితో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పారెళ్ల సాంబయ్య, కార్యదర్శిగా కారుచోల రోశయ్య ఎన్నికయ్యారు.


జెండావిష్కరణలో నాయకులు, ప్రతినిధులు

నేటికీ బహుముఖ రూపాల్లో వివక్ష

- హక్కుల సాధన, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలి
- కెవిపిఎస్ మండల మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అమరావతి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మండల ప్రథమ మహాసభ మండల కేంద్రమైన అమరావతిలోని తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్‌లో నిర్వహించారు. మహాసభకు బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై నేటికీ దాడులు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, పెత్తందార్లు రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేవాలయాల్లోకి అనుమతి లేకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, ఇళ్లు అద్దెకు ఇవ్వకపోవడం వంటివి వివక్షకు రూపాలుగా వెంటాడుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు హక్కులు లేకుండా చేస్తున్నారని, అగ్రకులాల వారే పెత్తనం చేస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతమని అన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలు ఆత్మగౌరవం, హక్కుల కోసం అంబేద్కర్, జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం 10 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బంక వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా మేకల చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎస్.రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా సుందర్‌రావు ఎన్నికయ్యారు. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబురావు, విజయ్ పాల్గొన్నారు.


జెండావిష్కరణలో నాయకులు, ప్రతినిధులు

రేపు జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలంలోని ధరణి కోటలో ఉన్న చరితరెడ్డి డిఫెన్స్ అకాడమీలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఏపీ అండర్-19 జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు శనివారం నిర్వహిస్తామని అకాడమీ డైరెక్టర్ ఇందూరు వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న ఈ పోటీలను గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సత్తెనపల్లి డిఎస్‌పి ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి ఎం.హనుమంతరావు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు 24, 25, 26 తేదీల్లో విజయనగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ తదితరులు పరిశీలించారు.


పోటీలకు సిద్ధమైన బాక్సింగ్ రింగ్

బాగా ఆడి పతకాలు తీసుకురండి..

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని జెడ్‌పి పాఠశాలలో ఖోఖో పురుషుల జిల్లా జట్టుకు 5వ తేదీ నుండి నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆర్.గోవిందరాజులు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో కారంపూడిలోని బ్రహ్మనాయుడు ఉన్నత పాఠశాలలో సీనియర్ విభాగంలో స్త్రీ, పురుషుల జట్లను గత నెల 30న ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈపూరు పాఠశాల పిఇటి ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులు శుక్రవారం నుండి ఆదివారం వరకు ప్రకాశం జిల్లా ఈదర గ్రామంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ ఎస్.అంకుల్, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, గోవిందు నాయక్ పాల్గొన్నారు.


జట్టుతో హెచ్‌ఎం గోవిందరాజులు, పిఇటి వెంకటేశ్వర్లు



నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కెఎల్‌పి స్కూల్‌లో సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ పాఠశాలలో గురువారం ప్రపంచ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ అనేది ప్రత్యేకంగా చదవాల్సిన అంశం కాదని, దైనందిన జీవితమే సైన్స్ అని, కావున అందరూ సైన్స్‌ను ఎంతో ఇష్టంతో అవాహన చేసుకుంటూ చదవాలన్నారు. ప్రిన్సిపాల్ వై.రధిని చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని బాగా చదువుకొని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన అనేక నమూనాలు, చార్టులను ప్రదర్శించి, వివరించారు.

కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో తప్పులు సవరించాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిఎఫ్ రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : మున్సిపల్ కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో తప్పులను సరిచేయాలని, కార్మికుల క్లైమ్‌లు వెంటనే పరిష్కరించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు బి.ముత్యాలరావు కోరారు. గురువారం స్థానిక కృష్ణనగర్‌లోని పిఎఫ్ రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ కార్మికుల పిఎఫ్ ఖాతాల్లోని వివరాలు, ప్రస్తుతం ఆధార్‌లో ఉన్న వివరాలు వేర్వేరుగా ఉన్నాయన్నారు.ఆధార్‌లో వివరాల ప్రకారం సవరించాలని కోరారు. పుట్టిన తేదీలు పిఎఫ్ ఖాతాలో ఒక విధంగా, ఆధార్‌లో మరొక విధంగా ఉన్నాయని, పుట్టిన తేదీ సరిచేయించుకోవటానికి పాస్‌పోర్టులు తీసుకొని పిఎఫ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సరిచేయట్లేదన్నారు. మరణించిన కార్మికుల పిఎఫ్ క్లైమ్‌లకు దరఖాస్తు చేసుకుంటే కొంత మందికి ఈడీ ఎంక్వైరీ పేరుతో సంవత్సరాల తరబడి ఆలస్యం చేస్తున్నారని, దీంతో ఆయా కార్మికుల కుటుంబ సభ్యులు పిఎఫ్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారనారు. వెంటనే పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలని కోరారు. తప్పులు సరిచేయటానికి మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ధర్నాలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఆది నికల్సన్, యూనియన్ నాయకులు పూనేపల్లి శ్రీనివాసరావు, కె.రాజు, పాశం పూర్ణచంద్రరావు, గాలి శ్రీనివాసరావు, బాలిన భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల హోరు.. పాడైన రహదార్లు

తాగునీటి పైపు లైనుకు పొంచి ఉన్న ప్రమాదం



ప్రజాశక్తి - తాడేపల్లి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసం సమీపంలో ఉన్న పెనుమాక ఇసుక క్వారీ నుండి పెద్దఎత్తున ఇసుక రవాణా జరుగుతుంది. కృష్ణానది పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు నుండి 10 టైర్ల భారీ వాహనాలు డబల్ లోడు ఇసుక వేసుకొని ఈ రోడ్డులో వందలాదిగా రవాణా సాగిస్తున్నాయి. దీంతో 2కి.మీ. దూరం గల ఉండవల్లి గుహల నుండి ఇసుక క్వారీ వరకు గల రోడ్డు పెద్దపెద్ద గుంతలు పడి పాడైపోయింది. రోడ్డుతోపాటు రోడ్డు పక్కన మార్జిన్ కూడా గుంతలు పడి భయానకంగా తయారైంది. రోడ్డు పక్కన గల మార్జిన్ భూమి కింద (రోడ్డు) కృష్ణానది నుండి పెనుమాక, యర్రబాలెం వెళ్ళేందుకు మంచినీళ్ళ పైపులైను ఉంది. భారీ వాహనాలు నిత్యం పెరగడం వలన, అధిక వర్షాల వలన ఎప్పుడైనా భూమికింద భాగాన ఉన్న పైపులైనుకు ఒత్తిడి తగిలి పగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భావిస్తున్నారు. అదే జరిగితే పెనుమాక మరియు యర్రబాలెం గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోతుంది. గతంలో అనేకసార్లు ఈ పైపులైన్





పగిలిపోయింది. అప్పట్లో ఎన్నికైన సర్పంచ్‌లు ఉండటం వలన, పంచాయతీలో నిధులు లేకపోయినా తమ సొంత ఖర్చుతో పైపులైన్ రిపేరు చేయించి యథావిధిగా మంచినీరు అందించేవారు. ఉండవల్లి, యర్రబాలెం, మంగళగిరి తాడేపల్లి కార్పోరేషన్‌పరిధిలోకి వచ్చాయి. కార్పోరేషన్‌లో నిధులున్నా గ్రామాలను పట్టించుకోవడంలేదనే అపవాదు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. ఈక్రమంలో పాడైపోయిన రోడ్డును వెంటనే బాగుచేయాలని, రెండు గ్రామాలకు మంచినీరు అందిస్తున్న పైపులైనుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



నాడు-నేడు పనులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడేపల్లి : పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులకు గురువారం స్థానిక శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శంకుస్థాపన చేశారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో శిలాఫలకాన్ని ఆవిష్కరిం పచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్‌కె మాట్లా డుతూ పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఫేజ్-2 కింద రూ.3కోట్ల41 లక్షల11వేలు మంజూర య్యాయని చెప్పారు. ఈ నిధుల ద్వారా 19 అదనపు తరగతి గదులతోపాటు 10 కాంపో నెంట్స్ నిర్మాణం అవుతాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహ నరెడ్డి నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వ్యాయామంతో మానసిక ఆరోగ్యం

వర్సిటీలో ఘనంగా ప్రపంచ విజ్ఞాన దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రతి ఒక్కరు వ్యాయామంతో పాటు శారీరక , మానసిక ప్రశాంతత పొందుట ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చునని వర్సిటీ విసి పి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా అడ్వాన్సస్ ఇన్ డయాబెటిక్ థేరఫి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం మంచి ఆలోచనలతో ఉండటం వలన మానసిక శారీరక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చును అన్నారు. తద్వారా చక్కర వ్యాధుల నుంచి కూడా విముక్తి పొందవచ్చునని చెప్పారు. ఎస్ వి ఆర్ డయాబెటిక్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ వి వి రామ్ కుమార్ మాట్లాడుతూ డయాబెటిక్ లో వివిధ రకాల గురించి తెలియజేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఔషధాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ ప్రమీలరాణి, డాక్టర్ రమణ మూర్తి, డాక్టర్ జిమ్మి రాణి పాల్గొన్నారు.



ప్రకాష్‌నగర్ ప్రాంతంలో నారాలోకేశ్ పర్యటన

ఇది పేదల ప్రభుత్వం కాదు : నారా లోకేశ్

ప్రజాశక్తి -తాడేపల్లి : ప్రజలపై భారాల మోపుతూ పేదల ఇళ్ళు కూల్చే ప్రభుత్వం రాష్ట్రంలో రాజ్యమేలుతుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే పేదల ఇళ్ళు కూలుస్తానని చెప్పిన ప్రస్తుత ఎమ్మెల్యే ఈ మూడేళ్ళ కాలంలో చేసిన పనేంటి అని ప్రశ్నించారు. రోడ్లవెంట చిరువ్యాపారుల షాపులను, బడ్డీకొట్లను గ్రామాల్లో ఇళ్ళను సైతం కూలుస్తూ బుల్డోజర్ పాలన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అండగా ఉండి తమకు అధికారం అప్పగిస్తే బుల్డోజర్ పాలన సాగనివ్వబోమని హామీనిచ్చారు. గురువారం తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరినీ పలుకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కార్యదర్శి దాసు, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం గుంటూరు పర్యటనను పురస్కరించుకొని జిఎంసి నుండి చేపట్టాల్సిన పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. గురువారం కమిషనరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్, నగరం పాలెం జంక్షన్, మెడికల్ కాలేజి రోడ్, మూడు బొమ్మల సెంటర్‌లో జంక్షన్ అభివృద్ధి పనులు, పెరేడ్ గ్రౌండ్ నుండి రమేష్ హాస్పిటల్ వరకు జరుగుతున్న డివైడర్ పెయింటింగ్, వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేజి, సీటింగ్, లైటింగ్ పనులను తనిఖీ చేసి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కూడా కేటాయించిన విధుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో, ఫుడ్ కౌంటర్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, ఈ.ఈ. సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఏ.డి.హెచ్. రామారావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో సమావేశమైన కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ

జయప్రదం చేయండి : ఈచంపాటి

ప్రజాశక్తి-గుంటూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) పిలుపునిచ్చారు. గురువారం బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశంలో నిర్వహించారు. సిఎం పర్యటనకు ప్రతి కార్యకర్త హాజరై ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు తాడేపల్లి విజయకృష్ణ, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వెంకట రమణ, మహేంద్రా గులేచా, నాగార్జున, యం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అండర్-19 క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్ జట్ల ఎంపిక జరిగింది. రైఫిల్ షూటింగ్, టెన్నికాయిట్ జట్ల ఎంపిక స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో నిర్వహించారు. జట్ల ఎంపిక కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ సుధాకర్ రెడ్డి నిర్వహించగా జట్ల ఎంపికలో ఫిజికల్ డైరెక్టర్లు జి నరసింహారావు, ఉదయభాస్కర్, వై పెద్దబ్బాయి, పద్మాకర్, విశ్రాంత పీడీలు మెట్టు సంజీవరెడ్డి, ఆళ్ల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



హైరిస్క్ గర్భిణీల వివరాలు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - రాజుపాలెం

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా డిఐఒ డాక్టర్ గీతాంజలి సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణిలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణిలకు నెలకు రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలోని గర్భిణిలు, బాలింతలకు వైద్య సేవలందేలా ఎమ్. ఎల్.ఎచ్.పి లు, ఎ.ఎన్.ఎమ్ లు, ఆశా కార్యకర్తలు బాధ్యతగా తీసుకోవాలని, ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం ఆరు కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. రికార్డ్స్, రిపోర్ట్స్, ల్యాబ్, వాక్సినేషన్ నిల్వ చేసే ఫ్రిజ్ లను, కాన్పుల గదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



దోమల నివారణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-మాచర్ల

దోమల కుడితే వచ్చే రోగాలు, వాటి నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక మలేరియా సిబ్బందిని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ ఆదేశించారు. పట్టణంలో పలు సచివాలయాల పరిధిలోని మలేరియా, డెంగీ జ్వర పీడితులను గురువారం పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ళ చుట్టు మురుగునీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమల నివారణ జరుగుతుందన్నారు. దోమ తెరల వాడకం ద్వారా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ళలో, ఇళ్ళ చుట్టు మురుగునీరు, నీరు నిల్వ లేకుండా చూసుకునేందుకు ప్రతి శుక్రవారం డ్రై డేగా భావించి నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టరు లక్ష్మీప్రసన్న, స్థానిక మలేరియా యూనిట్ ఇన్‌చార్జి టి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్టియులో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -నరసరావుపేట

మండలంలోని కాకాని సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జేఎన్టీయూ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ మొదటి సంవత్సరంలో 200 మందికి పైగా విద్యార్థులు తరగతులకు హాజరైనట్లు పేర్కొన్నారు. జెఎన్టియు యూనివర్సిటీ పల్నాడు జిల్లాకు గర్వకారణమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ శోభన్ బాబు ఆధ్వర్యంలో మొదటి సంవత్సర విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. సొంత భవనంలో సకల సదుపాయాలు కల్పించామన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీ ఒక మోడల్ యూనివర్సిటీ గా రూపు దిద్దుకోనుందని, ఆ దిశగా కృషి చేస్తున్నట్టు తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్‌కు బదులు జ్యూట్ బ్యాగ్‌లు

ప్రజాశక్తి- మాచర్ల



ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు వ్యాపారుల సహకారం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు అన్నారు. పట్టణంలో కిరాణా మర్చంట్స్, ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ సంయుక్తంగా మున్సిపల్ కమిషనర్‌కు ఆరు వేల జ్యూట్ బ్యాగులను గురువారం అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో రమణ బాబు మాట్లాడుతూ పట్టణంలో నిషేధిత, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం స్థానంలో ప్రజలకు ఆరు వేల జ్యూట్ బ్యాగులను అందజేసినట్లు తెలిపారు. వీటిని పట్టణంలో సచివాలయ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లతో సంచరించే వారికి అవగాహన కల్పించి, పెనాల్టీలు వేసి జ్యూట్ బ్యాగులు అంద జేస్తారని అన్నారు. ప్రజలు ఇంటి నుండి బయటకు వచ్చే టప్పుడు తప్పనిసరిగా జ్యూట్ బ్యాగులతో రావాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లతో సంచరించే వారికి పెనాల్టీలు తప్పవని హెచ్చరించారు. మాచర్ల టౌన్‌ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజ లందరు తమ సహకరించాలని కోరారు. కిరాణా, ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్య క్షులు డి. వెంకటశేష పుల్లారావు, కె.గాలేశ్వరరావు, ఎం.రామక్రిష్ణ, వెంకటరామయ్య, షేక్ జున్ను సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రోడ్డు సర్వే

ప్రజాశక్తి-ఈపూరు



మండలంలోని కొచ్చర్లలో రోడ్డు విస్తరణలో భాగంగా వినుకొండ- కారెంపూడి ఆర్ అండ్ బి రోడ్డును గురువారం రెవిన్యూ, పంచాయతి, ఆర్ అండ్ బి అధికారులు సర్వే చేపట్టారు. సర్వే నిర్వహణను తహశీల్దారు సిహెచ్ విజయ జ్యోతికుమారి పరిశీలించారు. సర్వేలో భాగంగా హద్దులు నిర్ణయించి మార్కింగ్ వేశారు. ఆర్ అండ్ బి స్థలంలో అక్రమ నిర్మాణాల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తడం, నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే మార్గంలో ఆక్రమణలు అడ్డుగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్ బి లో ఆక్ర మణలు తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారులకు సూచించడంతో రోడ్డుకు ఇరువైపులా సర్వే చేశారు. సర్వే పూర్తయిన అనంతరం ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు తెలిపారు. అలాగే రెండు రోజులలో మండల కేంద్రమైన ఈపూరులో ఆర్ అండ్ బి రోడ్డు సర్వే ప్రారంభిస్తామని మండల సర్వేయర్ చండీరాణి తెలిపారు. సర్వేలో సర్పంచ్ కె. దేవరాజ్,ఆర్ అండ్ బి ఏఈ నవ్య, వీఆర్వో శామ్యూల్, సచివాలయ సర్వేయర్లు నాగరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణి శ్రావణి పరిస్థితిమరింత విషమం

ప్రజాశక్తి- నరసరావుపేట

లింగ నిర్ధారణ చేపించగా మళ్ళీ ఆడపిల్ల అని తెలుసుకొని తన కుమార్తె శ్రావణి కి అత్తింటి వారే ఆమెకు తెలియకుండా దశలవారీగా విషం ఇచ్చారని శ్రావణి తల్లి శివపార్వతి గురువారం ఆరోపించారు. తమ కుమార్తె ఆరోగ్య బాగాలేదని ఆసుపత్రిలో చేర్చామని అత్తింటి వారు చెప్పగానే వెంటనే వచ్చి కుమార్తెతో మాట్లాడానని నేను విషం తీసుకోలేదని ఇలా ఎందుకు జరిగిందో నాకు అర్థం కావటం లేదని శ్రావణి తన వద్ద వాపోయినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రావణి విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ లో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారని చికిత్సకు ఆమె శరీరం సహకరించడం లేదని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా శ్రావణికి ప్రమాదవశాత్తు ప్రాణాపాయం జరిగితే పోస్టుమార్టం నివేదిక నిష్పక్షపాతంగా ఇవ్వాలని నిందితులకు శిక్ష విధించి న్యాయం ఆమె కుటుంబ సభ్యులు కోరారు.

నెలాఖరుకు ధాన్యం కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి - రెంటచింతల

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల చివరి నాటికి రైతు భరోసా కేంద్రాలలో ప్రారం భించనున్నట్లు తహశీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి, సంబంధిత ఉద్యోగులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ వరి పంట కోత సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. వరి మద్దతు ధర ఎ1 గ్రేడ్ కు రూ.2060 ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.

జిల్లా పరిషత్ నిధులు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో బోరు మోటార్లు వేసే నిమిత్తం జిల్లా పరిషత్ నుంచి రూ.18 లక్షలు విడుదలైనట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కొత్త నరేంద్రరెడ్డి తెలిపారు ఒక్కొక్క బోరు మోటారుకు రెండు లక్షల రూపాయలు కేటాయించామన్నారు. రానున్న వేసవి దృష్ట్యా మంచినీటి కొరత లేకుండా ఉండేందుకు పాలువాయి, రెంటచింతల, గోలి, మల్లవరానికి రెండు లక్షల రూపాయలు చొప్పున, మెట్టగుడి పాడుకు లక్ష రూపాయల నిధులు కేటాయించా రన్నారు.

17న పట్టుబడ్డ వాహనాల వేలం

ప్రజాశక్తి-నరసరావుపేట

మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన వాహనాలతో పాటు వివిధ కేసులలో పట్టుబడిన 18 ద్విచక్ర వాహనాలను ఒక ఆటోను ఈ నెల 17న ప్రకాష్ నగర్ లోని స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్.ఈ.బి ఎస్ఐ సురేంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎవరైనా ఈ వేలంపాటలో పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చని తెలిపారు.

బ్రౌన్, ఏటుకూరి,రావి లకు నివాళి

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండల పరిది మునుగోడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన మహనీయులు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని వక్తలు కొనియాడారు. క్షేత్రలక్ష్మి పద్య కావ్యం,పల్నాటి యుద్ధం నేపథ్యంగా పల్నాటి వీరచరితము మొదలగు వానిని రచించిన కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య వర్ధంతిని, తెలుగు నవలా ప్రపంచంలో విజయవంతమైన, ప్రయోగాత్మక నవల అల్పజీవి రచయిత, నటుడు రావిశాస్త్రి వర్ధంతిని జరిపి వారి ఘనతను వక్తలు శ్లాఘించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణి

ప్రజాశక్తి-మాచర్ల



రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కెపి గూడెంలో 33/11కెవి సబ్‌స్టేషన్‌లో 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం 145 మంది గిరిజన రైతులకు 25కెవి ట్రాన్స్‌ఫార్మర్లను ఉచితంగా పంపిణి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నేరుగా సంక్షేమ పథకాలు రైతులకు అందుతున్నాయన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -అమరావతి



అమరావతి మండలం కర్లపూడి వాసుల రోడ్డు కల ఎట్టకేలకు తీరనుంది. 14వ మైలు నుంచి కర్లపూడి వరకు మార్కెట్ యార్డు నిధులతో తారు రోడ్డు నిర్మించనున్నారు. పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు తారు రోడ్డు నిర్మాణ పనులను ప్రారం భించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యా శాఖ కార్యాలయం నిర్మాణపు పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసరావుపేట



పట్టణ సమీపంలోని లింగంగుంట్ల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూమిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాలకు సమీపంలో జిల్లా విద్యా శాఖ సొంత శాశ్వత కార్యాలయం ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం అంతస్తు స్లాబ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 సెంట్ల స్థలంలో రూ.75 లక్షల నిధులతో అత్యాధునిక హంగులతో 3 అంతస్తుల భవన నిర్మాణ పనులు వేగవంతంగా చేస్తున్నట్లు చెప్పారు. పనులు వేగవంతం చేసి భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఇనాం, అగ్రహారం భూముల రైతుల హక్కుకు కృషి

ప్రజాశక్తి -నూజెండ్ల



ఇనాం, అగ్రహారం భూములను సాగుచేసు కుంటున్న రైతులకు వాటిపై హక్కు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 108వ రోజులో భాగంగా గురువారం మండలంలోని వి.అప్పాపురంలో ఆయన పర్యటించారు. బ్రహ్మ నాయుడు మాట్లాడుతూ వీటిని సాగుచేసుకుంటున్న రైతులకు ఆ భూములపై హక్కు కల్పించేందుకు ఎంతో కషి చేస్తున్నాని మీ భూమిపై మీకు హక్కు కల్పిం చేందుకు ఎన్ని కష్టనష్టాలనైనా లెక్కచేయనని అన్నారు. గ్రామంలో రీ సర్వే జరిగే సమయంలో రైతు లందరు అందుబాటులో ఉండి సర్వే అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నుండి పాలపర్తి పెద్ద అయ్యన్న, గర్నెపూడి జేజయ్య కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరాయి. వైసిపి కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఎంపిపి జయరామిరెడ్డి, జడ్‌పిటిసి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేసి చూపిస్తాం: ఎమ్మెల్యే కాసు

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేసి చూపిస్తామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం అదనపు బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌కు కావాల్సిన ప్రహరి, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఆర్టీసీ అధికారులు తయారు చేసుకొని వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

పట్టణంలోని జానపాడు రోడ్డులోని గుంత స్కూల్ లో అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధునాతనంగా, నాణ్యతతో తరగతి గదులు కడు తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బా రావు, వైస్ ఛైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్‌వాడీలకు జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమాసుష్మ, పి.దీప్తి మనోజ గురువారం ఒక ప్రకటనలో కోరారు. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొంటుందని, ఇప్పుడు వేతనాలు కూడా ఆలస్యం అవున్నాయని, దీంతో అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్‌వాడీలు అనేక వ్యయ ప్రయాసలకోర్చి విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న సెంటర్ అద్దెలు, మెనూ ఛార్జీలు సరిపోక వేల రూపాయాలు తమ జీతాల నుండి ప్రతి నెలా ఎదురు పెట్టాల్సి వస్తుందన్నారు. గత ఐదేళ్ల నుండి టిఎ, డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, రెండున్నరేళ్ళుగా సిబి ఈవెంట్లు నిర్వహించిన మొత్తాన్ని చెల్లించట్లేదని తెలిపారు. ప్రస్తుతం 10వ తేదీ వచ్చినా అక్టోబర్ వేతనాలు జమ కాలేదన్నారు. తక్షణమే బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా

ప్రజాశక్తి- మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ఉంచినట్లుగా అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని గురువారం తెలిపారు. తాడేపల్లి అర్బన్ పరిధిలోని పోలింగ్ కేంద్రం 19 నుండి 65 వరకు ఆయా కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా ఇచ్చినట్లుగా తెలిపారు. మంగళగిరి అర్బన్ పరిధిలోని 138 పోలింగ్ కేంద్రాల నుండి 196 వరకు ఆయా కేంద్రాల వద్ద జాబితా పెట్టినట్లుగా తెలిపారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీ లోపు6,7,8 దరఖాస్తు ఫారాలతో తెలియజేయాలని కోరారు. ఈ జాబితా 2023 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్ల వయసు నిండిన వారందరూ ఓటర్లుగా ఉన్నారు.



సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ బృందం

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి-తెనాలి: పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. క్లబ్ కార్యదర్శి నేరెళ్ళ కృష్ణమోహనరావు పుట్టిన రోజు సందర్భంగా ఆయన సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షులు సాతులూరి రాంప్రసాద్ తెలిపారు. క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం క్లబ్ తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నేరెళ్ళ కృష్ణమోహనరావు, జవ్వాజి శ్రీనివాసరావు, కె.రమేష్‌కృష్ణ, వి.సాంబశివరావు, ఎస్.తిరుమలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పిఆర్ ప్రియదర్శిని, కెబి సరస్వతి, ఎంవి రఘునాథరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు టి సతీష్ బాబు

రోటరీ యూత్ అవార్డ్స్‌కు దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో 2022 నవంబర్ చివరి వారంలో యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు టి సతీష్ బాబు తెలిపారు. గురువారం మంగళగిరి రోటరీ క్లబ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయిలో వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచి అవార్డులు, రివార్డులు సాధించిన యువతి యువకులకు అవార్డులను ఇచ్చి సత్కరించడం జరుగుతుందని తెలిపారు. మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఈనెల 18వ తేదీ లోపు 9059303150 ఫోన్ నెంబర్ కు వాట్సప్ చేయాలని తెలిపారు.సమావేశంలో క్లబ్ ట్రైనర్ ఇసునూరి చక్రవర్తి, యూత్ ఐకాన్ అవార్డ్స్ ప్రాజెక్ట్ చైర్మన్ పి రాజశేఖర్‌లు ఉన్నారు.

25వ రోజుకు పారిశుధ్య కార్మికుల ఆందోళన

అంబేద్కర్ విగ్రహానికి వినతి



తుళ్లూరు లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం కట్టిన పారిశుధ్య కార్మికులు, ఎం రవి

ప్రజాశక్తి - తుళ్లూరు

మూడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు గురువారంతో 25 వ రోజుకు చేరాయి. జీతాలు చెల్లించాలంటూ రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం, సిఐటియు అధ్వర్యంలో గురువారం తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పారిశుధ్య కార్మికులు వినతిపత్రం కట్టారు. జీతాల కోసం సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి విన్నవించామని, పని విరామ సమయంలో అధికారులతో సామూహిక రాయబారం, వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేదని పారిశుధ్య కార్మికులు సుఖవేణి, నంబూరు రేణుక, దుర్గ వాపోయారు. అనంతరం కార్మికులు తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని,పని భద్రత కల్పించాలని అంబేద్కర్ విగ్రహం ముందు నినాదాలు చేశారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తామంతా పేదలమని, నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వారు ప్రశ్నించారు. డ్వాక్రా రుణాలు చెల్లించాలని, ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తెచ్చిన అప్పులు తీర్చాలని ఒత్తిడి పెరుగుతోందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి ధర్నాలో మాట్లాడుతూ కార్మికులకు జీతాలు చెల్లించరా, రాజధానిలో పనిచేసే కార్మికుల మీద ప్రభుత్వం కక్ష కట్టిందా? అని ప్రశ్నించారు. రాజధానిలో కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. జీతాలు లేక అర్థాకలితో అలమటిస్తున్న కార్మికుల భిక్షాటన కార్యక్రమాన్ని మందడం సెంటర్ నుండి రాష్ట్ర సచివాలయం వరకు నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే, కార్మికుల జీతాలు చెల్లించకపోతే, పని భద్రత కల్పించేందుకు హామీ ఇవ్వకపోతే సమ్మె తప్పదన్నారు. తరువాత జరిగే పరిణామాలకు ప్రభుత్వము, అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని రవి హెచ్చరించారు. ధర్నాలో ఎన్ కోటేశ్వరరావు, వెలగలేటి బుజ్జి, వీరలంకమ్మ పేరం బాబురావు, షేక్ జానీ పాల్గొన్నారు.

మాతృమూర్తి ప్రాధాన్యతను గుర్తెరగాలి

వ్యాసరచన పోటీల్లో విజేతలు బహుమతులు ప్రధానం



బహుమతులు సాధించిన విద్యార్థులతో తహశీల్దార్ రాంప్రసాద్

ప్రజాశక్తి- మంగళగిరి

ప్రతి ఒక్కరూ మాతృమూర్తి ప్రాధాన్యతను గుర్తెరగాలని మంగళగిరి తహశీల్దార్ జివి రాంప్రసాద్ అన్నారు. మంగళగిరిలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు మమకారాల మాతృమూర్తి నా కృతజ్ఞత, భారతీయ సంస్కృతి, నా జీవిత లక్ష్యం దాని ద్వారా దేశాభివృద్ధి అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రధానం చేశారు. వ్యక్తులు బాగుంటే సమాజం బాగుంటుందని తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ధర్మాన్ని కాపాడటం సంస్కృతిలో భాగమని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మాతృమూర్తికి తగు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ సాయికృష్ణ ప్రిన్సిపల్ ఉదయలక్ష్మి, కన్వీనర్ డాక్టర్ ఆర్.రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర అవార్డుకు ఎంపికైన ఖైరున్నిసా బేగం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్



ఖైరున్నిసాబేగం

భారత విద్యా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఖైరున్నిసా బేగం ఎంపికయ్యారు. ఈ అవార్డును రేపు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సిఎం చేతులమీదుగా అందుకోనున్నారు. పొన్నూరు మండలం మాచవరం గ్రామంలో ఉర్దూ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఖైరున్నిసా బేగంకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పొన్నూరు మండలం శాఖ అధ్యక్షులు ఎంఎం. ఖుదుస్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు జి. శివరామకృష్ణ , బద్రుదీన్, హబీబ్, సి. హెచ్.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఈదర రాంబాబు

ప్రజాశక్తి- మేడికొండూరు

నవంబర్ 1-31వరకు జాతీయ సమగ్ర ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలను సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఈదర రాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని వెలవర్తిపాడులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బ్యాంకు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. బ్యాంకు అకౌంట్ యొక్క ప్రాముఖ్యత , రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంకు ప్రొడక్ట్స్, సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గుంటూరు సిబ్బంది అంజలి దేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు పలు రకాల స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అందులో భాగంగా టైలరింగ్, మగ్గం, వివిధ రకాల కారపొడుల, జూట్ బ్యాగుల తయారీ, సెల్ ఫోన్ మెకానిజం, కంప్యూటర్ మెకానిజం, ఏసీ రిపేరు, ద్విచక్ర వాహనాల మెకానిక్, గురించి ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. సత్తనపల్లి కౌన్సిలర్ పి. రమేష్, కూచిపూడి నాని, ఏడుకొండూరు ఎస్‌బిఐ బిఎం రమేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేష్, గ్రామ సర్పంచ్ ఎం. విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విజయసాగర్‌లు పాల్గొన్నారు.



దుర్గారావుకు సాయం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి : ఈ నెల 25, 26 27 తేదీల్లో జిల్లా కేంద్రం గుంటూరులో జరగనున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మంగళగిరి ప్రాజెక్టు యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు కోరారు. గురువారం పెనుమాకలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఐటియు పోరాట ఫలితంగానేఅంగన్‌వాడీల వేతనాలు దఫాలవారీగా గౌరవప్రదంగా పెంచు కోగలిగామని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం రూ.22వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెక్టార్‌లో కీలకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీల శ్రమను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త బాణావత్ వెంకటలక్ష్మి మహాసభల జయప్రదానికి తన వంతు ఆర్థికసాయాన్ని వేముల దుర్గారావుకు అందజేసింది. ఈ కార్యక్రమంలో రేపు గుంటూరు సిఐటియు కార్యాలయంలో జరిగే మహిళా ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని తీర్మానించారు.

14న ఐటిఐలో అప్రెంటీస్ రోజ్ ఘార్ మేళా

ప్రజాశక్తి-తెనాలి : స్థానిక చినరావూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల్లో ఈనెల 14న 'అప్రెంటీస్-రోజ్‌ఘార్ మేళా' నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ మేళాలో దాదాపు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, ఏ ట్రేడ్‌లోనైనా ఐటిఐ డిప్లమో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు అధార్, విద్యార్హతల సర్టిఫికేట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కళాశాల్లో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాల్సిందిగా కోరారు. వివరాలకు 9959828100, 9985614465 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ కార్యదర్శి డేవిడ్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - మంగళగిరి



గరికముక్కు భారతరావు (ఫైల్)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ కార్యదర్శి గరికముక్కు డేవిడ్ తండ్రి గరికముక్కు భారతరావు(86) వద్ధాప్య కారణంగా గురువారం తెల్లవారుజామున పాత మంగళగిరి సంజీవ నగర్‌లోనివాసంలో కన్నుమూశారు. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలరు. భారతరావు కొబ్బరికాయల వ్యాపారవేత్తగా మంచి పేరు సంపాదించారు. భారతరావు కుమారుడు గరికముక్కు డేవిడ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ పేరుతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ తండ్రి కొబ్బరికాయల వ్యాపారాన్ని తాను కొనసాగిస్తూ ఉన్నాడు. భారతరావు భౌతికాయాన్ని ఎస్సీ ఎస్టీ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జంగం నరసింహారావు, మద్దిరాల రమేష్, బూసి గోవిందరాజు, కమలాకర్, పాస్టర్ రవి ప్రకాష్, వెంకయ్య తదితరులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జనసేన మంగళగిరి పట్టణ అధ్యక్షులుగా మునగపాటి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నగర జనసేన పార్టీ అధ్యక్షు లుగా మునగపాటి వెంకట మారుతిరావును నియమిస్తూ జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గురువారం మారుతీ రావు మాట్లాడుతూ నగర అధ్యక్షులుగా తనని నియమించిన జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు, రాష్ట్ర కార్యదర్శి చల్లపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మారుతీ రావు నియామకం పట్ల నగర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాయామ టీచర్ నూర్జహాన్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - చేబ్రోలు : చేబ్రోలు మండలం లాల్‌పురం జడ్‌పి హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న షేక్ నూర్జహాన్ బేగం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నూర్జహాన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ జాన్సన్ పర్యవేక్షణలో ఐసోలేటెడ్ కంబైన్డ్ అండ్ కాంప్లెక్స్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ ఇంపాక్ట్ ఆన్ సెలెక్టెడ్ పవర్ అండ్ పెర్ఫార్మెన్స్ పారామీటర్స్ ఆఫ్ మెన్ హేమర్ త్రో అనే అంశాలపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎల్ ఉదయకుమార్ తెలిపారు. నూర్జహాన్‌కు సహ ఉపాధ్యాయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

ఎరువులు సకాలంలో సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎఒ వెంకటేశ్వర్లు

గుంటూరు జిల్లాకు నెలవారీ ఎరువుల సరఫరాకు సంబంధించి నవంబర్ నెలకు సంబంధిం చిన ఎరువుల సరఫరా ప్రణాళికపై వివిధ కంపెనీల ప్రతినిధులు, ఏడీఏలు, మార్క్‌ఫెడ్ డిఎంతో జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నవంబర్ నెలకు సంబంధించి 3500 టన్నులు ఎరువులు అవసరం కాగా వివిధ కంపెనీలు ఏఏ తేదీల్లో సరఫరా చేస్తారో, ఎంత సరఫరా చేయాలి తదితర వివరాలు సేకరించారు. ఇందులో డిఎపి వెయ్యి టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1100 టన్నులు, పొటాష్ 500 టన్నులు, మిగిలినవి ఇతరాలు ఉన్నాయన్నారు. ఇందులో సగం ఖచ్చితంగా మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేయాలని డిఎఒ స్పష్టం చేశారు. అదే విధంగా రబీ సీజన్ ప్రారంభం కాబోతున్నందున మార్క్‌ఫెడ్ వద్ద యూరియా 4వేల టన్నులు, డిఎపి వెయ్యి టన్నులు బఫర్ స్టాక్ ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం 600 టన్నుల నిల్వలు ఉన్నాయని, కావున మిగిలిన బఫర్ స్టాక్‌కు అవసరమైన సరఫరా చేపట్టాలని ఆదేశించారు. వేగన్ల ద్వారా వచ్చిన ఎరువులను ఎప్పుటికప్పుడు మార్క్‌ఫెడ్‌కు, డీలర్లకు నిర్దేశించిన పరిమాణంలో సరఫరా అయ్యే విధంగా రేక్ ఇన్‌ఛార్జ్‌లు గుంటూరు, తెనాలి, మంగళగిరి ఏడిఎల పర్యవేక్షణ చేయాలన్నారు. మార్క్‌ఫెడ్ ప్రతినిధి అరుణ్, మంగళగిరి ఏడిఎ శ్రీనివాసరెడ్డి, తెనాలి ఇన్‌ఛార్జి ఎడిఎ వెంకట్రావు, ఏఒలు గౌతమ్ ప్రసన్న, కిషోర్, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘంటసాల, బాలు విగ్రహాలకు శంకుస్థాపన



శంకుస్థాపనకు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - నరసరావుపేట : పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్ ప్రాంగణంలో ప్రముఖ గాయకులు ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం, ఘంట సాల విగ్రహాల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గాన గంధర్వులను స్మరించుకోవడం అందరి కర్తవ్యంగా భావించాలన్నారు. తెలుగు పాటలకు అఖండ కీర్తి తీసుకొచ్చిన మహనీయులు ఘంటసాల మరియు ఎస్.పి బాల సుబ్రమణ్యమని వారి పాటల వల్ల తెలుగు భాష కీర్తి పెరిగిందని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి టౌన్ హాల్‌లో మహనీయులు విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. డిసెంబర్ 4వ తేదీన ఘంటసాల శత జయంతి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టౌన్ హాల్ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివీస్ ప్రతినిధి రామకృష్ణ

హిందూ ఫార్మసిలో దివిస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం దివిస్ లాబొరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన వచ్చిందని, వివిధ కళాశాలల 255 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి దివిస్ లాబొరేటరీస్ హెచ్.ఆర్.డి. ప్రతినిధులు రామకష్ణ, నవీన్ పాల్గొని విద్యార్థులకు రాత పరీక్ష ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూలో 80 మందిని ఎంపిక చేశారు. వారికి దివిస్ లాబొరేటరీస్ మేనేజ్ మెంట్ నెల రోజులలో జాబ్ ఆఫర్ పంపనున్నట్లు హెచ్.ఆర్.డి. మేనేజర్ తెలియ చేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి కుమార్, ఓఎస్‌డి డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్ మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు , సభ్యులు డాక్టర్ కె.విజయ భాస్కర్, బి.బ్రహ్మయ్య, డాక్టర్ లక్ష్మిభానుశ్రీ, డాక్టర్ డి.కష్ణ ప్రియాంక, షేక్ శర్మాస్, వి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి వర్సిటీలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. శుక్రవారం నుండి ప్రారంభం కానున్న పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా మరియు సాంస్కృతిక ఉత్సవాలు - 2022 పురస్కరించుకుని ఉమ్మడి 13 జిల్లాల నుండి 1200 మంది క్రీడాకారులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, డెప్యూటీ కలెక్టర్ మరియు ఒలింపియన్ కుమారి పి.వి.సింధు ముఖ్య అధితులుగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రెవెన్యూ క్రీడలకు జిల్లా ఉద్యోగులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో నేటి నుండి 13వ తేదీ వరకు జరుగుతున్న ఆరవ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కతిక ఉత్సవాలలో పాల్గొనేందుకు వెళుతున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగుల బస్సును గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ డైరక్టర్ డాక్టర్ జి.సి కిషోర్ కుమార్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. క్రీడలలో పాల్గొంటున్న ఉద్యోగులకు స్పోర్ట్స్ యూనిఫాం, షూలతో కూడిన కిట్‌లను కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి అందించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



వర్సిటీలో పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



క్రీడలకు వెళుతున్న ఉద్యోగులకు స్పోర్ట్స్ కిట్లు అందచేస్తున్న కలెక్టర్ తదితరులు

మైనార్టీలకు అండగా ఉంటాం

డిప్యూటీ సిఎం అంజాద్ బాషా - సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఎంబి అంజాత్, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మైనార్టీలకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి యస్.బి.అంజాద్ బాషా తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద మైనార్టీల సంక్షేమ దినోత్సవంలో సిఎం జగన్ శుక్రవారం పాల్గొంటున్న నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని సంక్షేమ కార్యక్రమాలను, రాజకీయంగా ఎదుగుదలకు మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. మేయర్ కావటి శివనగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అట్టడుగు ఉన్న మైనారిటీలను ఉపాధి, విద్యా పరంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని అన్నారు. మైనారిటీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం మతతత్వ పార్టీలతో పొత్తు పెట్టుకొని రాష్ట్రంలో 8 శాతం ఉన్న మైనారిటీ వర్గాలకు ఎటువంటి పదవులు కేటాయించలేదన్నారు. సభ్యులు మహ్మమద్ ముస్తఫా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి మైనారిటీల విద్య, అరోగ్యం, ఆర్థిక, రాజకీయ వృద్ధికి చేస్తున్నకృషికి సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. శాసన సభ్యులు మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి విద్యా శాఖా మంత్రి జనాబ్ మోలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్య ద్వారానే అట్టడుగు వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యా రంగంలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి కూడా అదే ఆశయంతో రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచేందుకు విద్య పేద వర్గాల తల్లితండ్రులకు భారంగా లేకుండా అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ మాట్లాడుతూ తొలి విద్యా శాఖామంత్రి జనాబ్ మోలానా అబుల్ కలామ్ ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో సమూల మార్పుల కోసం విప్లవాత్మకమైన సంస్కరణలను అమలు చేస్తున్నారన్నారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఉర్దూ భాష పరిరక్షణకు సేవలు అందించిన ప్రతిభావంతులు అవార్డులను ప్రదానం చేయనున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫిజ్, రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ డైరెక్టర్ కిషోర్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనరు కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శాసనమండలి సభ్యుల లేళ్ళ అప్పిరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసు రత్నం, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో శుక్రవారం సిఎం పర్యటనకు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. బందోబస్తుపై జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు.సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది, కాన్వాయ్ నిర్వహణ, ట్రాఫిక్ మళ్లింపులో ఇబ్బందులులేకుండా చూడటం, సమయపాలన తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. విధి నిర్వహణలో డ్యూటీ పాయింట్ వదిలి వెళ్ళరాదని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సమస్యని వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించాలని, పార్కింగ్ విషయంలో ప్రత్యేక దష్టి సారించాలని డ్యూటీలు కేటాయించిన అధికారులను సిబ్బందిని ఆదేశించారు.ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరు అయితే చర్యలు తప్పవన్నారు. గురు వారం సిఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. అలాగే గన్నవరం నుంచి హెలి కాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించింది.



వంకాయలపాడులో స్పైసెస్ ప్రోసెస్ యూనిట్ ప్రారంభం

యడ్లపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వంకాయలపాడు సమీపంలో ఉన్న స్పైసెస్ పార్క్ వద్ద జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పరిశీలించారు. స్పైసెస్ పార్క్ వద్ద జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, ఐటిసి ప్రతినిధులతో కలసి ట్రయల్ రన్ నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నిర్మించిన హెలిపాడ్ ప్రాంతం నుంచి సభా వేదిక వరకు చేసిన ఏర్పాటులను పరిశీలించారు. రోడ్డుకి ఇరువైపుల బారికేడ్ల ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ప్రసంగం, తిరుగు ప్రయాణం వరకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏర్పాట్లకు సంబంధించి జిల్లా ఎస్‌పి రవిశంకర్ రెడ్డి, ఏఎస్పీ బిందు మాధవ్, ఐటీసీ కంపెనీ ప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఉదయం 9 : 30 గంటల నుండి 11 : 00 గంటల వరకు ముఖ్యమంత్రి యడ్లపాడు స్పైసెస్ పార్క్(సుగంధ ద్రవ్యాల పార్క్) లోని గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించి అధికారులు అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.